# సాక్షి
# పార్వతీపురం మన్యం

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023






**లైసెన్స్ లేకుంటే తస్మాత్..**

లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్న వారిపై ఔషధ నియంత్రణ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. - 8లో



**అథ్లెటిక్స్‌లో పతకాల పంట**

రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 40 పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. - 8లో



**సారా రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..**

సారా రవాణా అమ్మకాలను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. - 8లో



## న్యూస్‌రీల్

### విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

- డీఈఈ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ డీఈఈ వెంకటరత్నం

పార్వతీపురంటౌన్: విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని ఎలక్ట్రికల్ డీఈఈ వెంకటరత్నం అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఆధార్ అనుసంధానానికి వినియోగదారులు తక్షణమే సమీప విద్యుత్‌శాఖ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. లైన్‌మన్, బిల్ కలెక్టర్ వద్ద కూడా ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ రామారావు పాల్గొన్నారు.

### వైభవంగా పైడితల్లి, విజయనగరం ఉత్సవాలు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించే పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను అన్నివర్గాల ప్రజలను కలుపుకుంటూ వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులకు సూచించారు. అందరి సమాలోచనలతో మూడు రోజుల ఉత్స వాలను ఆకట్టుకునేలా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేయాలని బొత్స సూచించారు. ఉత్సవ్ కమిటీలో సభ్యులుగా సభ్యులుగా చేరాలనుకునే వారు కలెక్టర్‌ను కలిసి వివరాలను సమర్పించాలని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తారని, వారిని ఆకట్టుకునేలా ఉత్సవ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆనంద గజపతి ఆడిటోరియంలో స్థానిక కళాకారులతో సోమవారం మెగా మ్యూజికల్ నైట్ నిర్వహించాలన్నారు. పుష్ప ప్రదర్శన, క్రీడలు, డాగ్‌షో, జానపద కళా ప్రదర్శనలు గతం కంటే మెరుగ్గా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

- ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోంది: మంత్రి బొత్స
- ఆంధ్రాకు జగన్‌మోహన్ రెడ్డి కావాలి: డిప్యూటీ సీఎం రాజన్నదొర
- జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: పరీక్షిత్ రాజు



వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్: ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. జిల్లాలో 45 రోజుల పాటు పల్లెలు, పట్టణాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఆరు నెలలు కీలకమని, 2024లో జరగనున్న ఎన్నికల్లో 2019 ఫలితాలు పునరావృతమయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్వతీపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో బొత్స మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని సహించేది లేదని స్పష్టంచేశారు. పార్టీ కార్యక్రమంలో కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ కార్యకర్తలు భాగస్వాములు కావాలని సూచించారు. ఆంధ్రాకు ఎందుకు జగన్ కావాలన్నది ప్రతీ ఒక్కరికీ తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను సచివాలయల్లో ప్రదర్శించాలని సూచించారు. టీడీపీ నేతలు, ఎల్లోమీడియా మాయమాటలు చెప్పి మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు.

**దప్పుకొట్టి చెప్పండి...**

దప్పు కొడతారట... హారన్ మోగిస్తారట అంటూ టీడీపీ మోత మోగిస్తాం కార్యక్రమంపై మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు డబ్బులు దోచుకున్న విషయాన్ని టీడీపీ నాయకులు డప్పుకొట్టి చెబుతుండడం బాగుందన్నారు. చంద్రబాబు చేసిన అవినీతి ప్రజలకు తెలుసని, రానున్న ఎన్నికల్లో బుద్ధిచెబుతారన్నారు.

**'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి'పై అవగాహన**

ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి? అనే కార్యక్రమంపై ఐపాక్ సిబ్బంది వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అక్టోబర్ 1న మొదటి రోజు గ్రామ సచివాలయ పరిధిలో గడచిన నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించాలన్నారు. అనంతరం అదే ప్రాంతంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసి అక్కడే రాత్రి బస చేసి పార్టీ బలోపేతంపై గ్రామస్తులతో చర్చించాలి. రెండవ రోజు సచివాలయం పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి 'ఆపు బాబు నాటకం- జగనే మా నమ్మకం' అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి, గుండు కృష్ణమూర్తి, వి.శ్రీనివాసరెడ్డి, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, వైస్‌చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, జేఏఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

### మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం



రానున్న ఎన్నికల్లో పార్వతీపురం మన్యం జిల్లాలోని అసెంబ్లీ సీట్లను క్లీన్‌స్వీప్ చేసి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేస్తాం. జగన్‌మోహన్ రెడ్డి లాంటి నాయకుడు రాష్ట్రానికి అవసరమనే విషయాన్ని ప్రతీ కార్యకర్త నుంచి నాయకుడు వరకు ప్రజలకు వివరించాలి. విద్య, వైద్యం ఆరోగ్యం ఇవి సామాన్యులకు చాలా అవసరం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటిని అందజేస్తోంది. ఇంటివద్దకే సంక్షేమ పథకాలు, వైద్యాన్ని చేరుచేయడం జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యం. ప్రజారోగ్యాన్ని కాపాడుతూ మరణాల రేటు తగ్గించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారు. అందుకే మళ్లీ జగనే కావాలి.. జగనే రావాలి.. ప్రతీ ఇంటికి వెళ్లి మన రాష్ట్రానికి ఎందుకు అవసరమో వివరిద్దాం.

– పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి

### మనదే విజయం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తోంది. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోంది. ఆర్థిక లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన సాగిస్తోంది. 2024లో జరిగే శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు స్థానాల్లోనూ మళ్లీ మనదే విజయం. ఇంటింటికీ వెళ్లి ఆంధ్రా మళ్లీ జగన్ ఎందుకు కావాలి అన్నది వివరిద్దాం. కలిసికట్టుగా ముందుకు సాగుదాం.

– శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

## బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల పరిశీలన



బ్యాలెట్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం పార్వతీపురంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో పరిశీలించారు.

యూనిట్ల పనితీరును బీఈఎల్ సంస్థ ఇంజినీర్లు పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 3,250 బ్యాలెట్ యూనిట్లు, 2,560 కంట్రోల్ యూనిట్లు, 3,170 వీవీ ప్యాట్లు కేటాయించారన్నారు. వీటిలో 2,170 వీవీ ప్యాట్లు జిల్లాకు చేరాయని తెలిపారు. ఆయన వెంట డీఆర్వో జె.వెంకటరావు ఉన్నారు.

## 'జగనన్నకు చెబుదాం' రద్దు

పార్వతీపురం: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం అక్టోబర్ 2న రద్దుచేసినట్టు డీఆర్వో జె.వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యం

పార్వతీపురం: జిల్లాలో స్వచ్ఛతాహి సేవ కింద పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులకు శనివారం సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 955 గ్రామాల్లో 1910 కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించగా ఇంతవరకు 1454 కార్యక్రమాలు చేపట్టినట్టు వెల్లడించారు. ప్రతి గ్రామాన్ని శ్రమదానంతో పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు.





## జగనన్న ఆరోగ్య సురక్ష...

# ప్రజల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

| జిల్లా | వైద్యశిబిరాలు | ఓపీనమోదు | వైద్యపరీక్షలు |
|---|---|---|---|
| విజయనగరం | 28 | 10,289 | 9,263 |
| పార్వతీపురం మన్యం | 14 | 8,199 | 7,653 |

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం
- 42చోట్ల శిబిరాల నిర్వహణ
- 18,488 మందికి ఓపీ సేవలు
- అవసరమైన వారికి వైద్యపరీక్షలు... ఉచితంగా మందులు అందజేత
- శిబిరాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



పాచిపెంట మండలం విశ్వనాథపురంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. ఒకేరోజు 42 చోట్ల నిర్వహించిన వైద్యశిబిరాల్లో వైద్య బృందాలు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశాయి. జ్వరం నుంచి గుండె సంబంధిత వ్యాధుల వరకు మెరుగైన వైద్య సేవలు అందించాయి. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశాయి. ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పించాయి. వైద్య శిబిరాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. 45 రోజు లపాటు సాగే 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిబిరాల్లో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇప్పటికే ఫ్యామిలీడాక్టర్ విధానంలో ఇంటివద్దకే వైద్యం చేరువచేసిన ప్రభుత్వం... ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట నిపుణులైన వైద్యులతో సేవలందిస్తూ కొత్త చరితకు నాంది పలికిందన్నారు.

**వేలాది మందికి వైద్యసేవలు**

విజయనగరం జిల్లాలో 27 వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లోను, ఒకటి పట్టణ ప్రాంతంలో నిర్వహించారు. 10,289 మందికి ఓపీ చూడడంతో పాటు వారికి అవసరమైన 9,263 వైద్య పరీక్షలు చేశారు. కొంతమందికి ఈసీజీ కూడా చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన 382 మందిని జిల్లా ఆస్పత్రికి రిఫర్‌చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 14 వైద్య శిబిరాలు నిర్వహించారు. 8,199 మందికి వైద్యులు ఓపీ సేవలు అందించారు.

- ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తలపెట్టారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా జేఏఎస్ కార్యక్రమం జరిగింది. సాలూరు మండలం అన్నంరాజువలస, పాచిపెంట మండలం విశ్వనాథపురం గ్రామాల్లో జరిగిన ఆరోగ్య శిబిరాలను రాజన్నదొర ప్రారంభించారు. వైద్యపరీక్షలు చేయించుకున్నారు. పార్వతీపురం పట్టణ పరిధిలో జగన్నాథపురంలో నిర్వహించిన జేఏఎస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. పాలకొండ మండలం లుంబూరు, పాలకొండ నగర పంచాయతీ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ప్రారంభించారు. శిబిరాలను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, జేసీ గోవిందరావు తదితరులు పరిశీలించారు.
- మన దేశంలో మరే రాష్ట్రంలోని లేనివిధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. చీపురుపల్లి నియోజకవర్గం పరిధి గరివిడి మండలంలోని చుక్కవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ పైన సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది నట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. పికెట్ డ్యూటీ కానిస్టేబుల్ విచారణ చేయగా అతను యాచకుడని మాత్రమే తెలిసిందన్నారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అతని బంధువులు ఎవరైనా తెలిస్తే వెంటనే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

### గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం


సూరిమల్లి సూర్యనారాయణ మృతదేహం

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి సమీపంలో సెప్టెంబర్ 29న సువర్ణముఖి నదిలో గల్లంతైన సూరిమల్లి సూర్యనారాయణ మృతదేహం శనివారం పోలీసులు గుర్తించారు. కొండచాకరాపల్లి, కొప్పర, గీతనాపల్లి సమీపంలో పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించారు. చివరికి గీతనాపల్లి వద్ద శివాలయం ఆవరణలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు గొల్లుమన్నారు. అనంతరం ఎస్‌ఐ ఆర్.జనార్ధన ఆధ్వర్యంలో మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకొండ రూరల్: సిరికొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర లక్ష్మణరావు(30) మృతి చెందాడు. పాలకొండ ఇన్‌చార్జ్, సీతంపేట ఎస్‌ఐ నీలకంఠం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట మండలం అడ్డాకులగూడకు చెందిన ఈయన తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తుండగా సిరికొండ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. వాహనంపై నుండి కిందపడి తీవ్ర గాయాల పాలైన లక్ష్మణరావు ఘటనా స్థలంలోనే మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసారు.

### ముమ్మరంగా దర్యాప్తు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించిన అవకతవకలపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం ఆధ్వర్యంలో రికార్డులు శనివారం పరిశీలించారు. ఈ పరిశీలనలో 2019లో నవదుర్గ గ్రూపులో రూ.2.25 లక్షలు, లలితాంబ గ్రూపులో రూ.2.36 లక్షలు, అన్నమ్మపేరంటాలు గ్రూపునకు సంబంధించి రూ.2.70 లక్షల మేర తేడాలను గమనించామని టీఎంసీ వెల్లడించారు. రుణాలు చేసే ముందు తీర్మానాలు ఉండాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా అలా లేవన్నారు. అయితే ఈ రుణాలు తీసుకున్నారా అని సభ్యులు వద్ద ప్రస్తావించగా వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఈ మొత్తాన్ని తాము తీసుకోలేదని, ఆ డబ్బులు విషయం కూడా మాకు తెలియదని, అప్పటి నుంచి బ్యాంకు పుస్తకాలు కూడా ఆర్పీ ఉమాదేవి తన వద్దే ఉంచుకుందని అధికారుల వద్ద వాపోయారు. ఈ మొత్తాలకు తీర్మానాలు లేకుండా లోన్లు జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆర్పీని ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన ఆర్పీ తనకు పది రోజులు సమయం కావాలని కోరిందని టీఎంసీ తెలిపారు. దర్యాప్తులో సీఓ దానాలమ్మ ఉన్నారు.

### బాల శాస్త్రవేత్తలను తయారుచేద్దాం


మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారిణి, జిల్లా సైన్స్ అధికారులు

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీసి వారిని బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఆప్‌కాస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన డివిజన్ స్థాయి ఒరియంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ విద్యార్థులచే ప్రాజెక్టులు సిద్ధం చేయాలన్నారు. త్వరలో జరగనున్న జిల్లా స్థాయి ఒరియంటేషన్‌లో ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేసారు. కార్యక్రమంలో జిల్లా ఆప్‌కాస్ట్ కోఆర్డినేటర్ పి.రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణరావు, అకడమిక్ కోఆర్డినేటర్ కె.అయ్యప్ప, రిసోర్స్‌పర్సన్లు సతీష్‌రాజు, సురేష్, మహేష్, రాజు తదిరులు పాల్గొన్నారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹133 | ₹236 | ₹ 246 |

# లైసెన్స్ లేకుంటే తస్మాత్...

ప్రజారోగ్యానికి సంబంధించి వైద్యులు రాసే మందుల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలకు ఔషధ నియంత్రణ అధికారులు చెక్ పెడుతున్నారు. లైసెన్స్ లేకుండా నడుపుతున్న దుకాణాలు.. అధిక ధరలకు మందులు విక్రయించే దుకాణాలపై నిఘా పెట్టారు. దాడులు చేస్తున్నారు. తగు చర్యలు తీసుకుంటున్నారు.


మందులు

- అనధికారకంగా మందులు విక్రయించే వారిపై ఉక్కుపాదం
- ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ అధికారులు
- ఇప్పటివరకు 41 కేసులు నమోదు
- జిల్లాలో లైసెన్స్ కల్గిన మందులు దుకాణాలు 800

విజయనగరం ఫోర్ట్: తెర్లాం మండలం నెమలాం గ్రామంలో ఓ వ్యక్తి లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్నట్టు ఔషధ నియంత్రణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో సెప్టెంబర్ 22న ఔషధనియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆ వ్యక్తి ఇంట్లో రూ.30 వేలు విలువ చేసే మందులను సీజ్ చేసారు.

ఈ ఒక్క వ్యక్తిపైనే కాదు. లైసెన్స్ లేకుండా, నాణ్యత లేని మందులు విక్రయించే అనేక మందిపై ఔషధ నియంత్రణ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అధిక ధరకు మందులు విక్రయించే వారిపైన కేసులు నమోదు చేసి అక్రమార్కులపై కొరడా ఝళిపిస్తున్నారు. జిల్లాలో కొంతమంది లైసెన్స్ లేకుండా మందులు అక్రమంగా నిల్వ చేసి గుట్టుగా విక్రయిస్తున్నారు. కొన్ని మందుల దుకాణాల్లో నాణ్యత లేని మందులను కాసుల కోసం ఆశపడి విక్రయిస్తున్నారు. మరి కొంతమంది మందులను అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొంతమంది తమ ప్రాడక్టులతో జబ్బులు తగ్గించేస్తామని ప్రజలను మోసం చేస్తున్నారు. ఇటువంటి వాటిన్నింటికి అడ్డుకట్టే వేసే విధంగా ఔషధ నియంత్రణ శాఖ చర్యలు చేపడుతుంది.

**చర్యలు తప్పవు..**



జిల్లాలో ఎక్కడైనా లైసెన్స్ లేకుండా మందులు అక్రమంగా విక్రయించినా, నాణ్యత లేని మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంఆర్‌పీకి మించి మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటాం. ప్రతి నెల మందుల దుకాణాలను, ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం.

– రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

**41 కేసులు నమోదు**

జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఏడాది ఇప్పటి వరకు 41 కేసులు నమోదు చేశారు. ఇందులో 30 కేసులు కోర్టులో ఉన్నాయి. ఇందులో నాణ్యత లేని మందులు విక్రయించే కేసులు 17 ఉన్నాయి. అదే విధంగా లైసెన్స్ లేకుండా మందులు విక్రయించే కేసులు 9, మందులను అధిక ధర నిర్ణయించిన కంపెనీలపై 3 కేసులు, నకిలీ ప్రొడెక్టుతో జబ్బు నయం చేస్తున్న ఏజెన్సీపై ఒక కేసు ఉన్నాయి. 11 కేసులు ఇన్విస్టిగేషన్ (విచారణ) స్థాయిలో ఉన్నాయి. వీటిలో నాణ్యత లేని మందులపై 8 కేసులు, లైసెన్సు లేకుండా మందులు విక్రయించిన వారిపై 3 కేసులు నమోదయ్యాయి.

**ప్రతి నెలా పరీక్షకు 14 శాంపిల్స్**

జిల్లాలో ఇద్దరు ఔషధ నియంత్రణ అధికారులు ఉన్నారు. వీరిలో విజయనగరంలో ఒకరు, బొబ్బిలిలో ఒకరు ఉన్నారు. జిల్లాలో 800 మందుల దుకాణాలు ఉన్నాయి. వీరు ప్రతి నెల మందుల దుకాణాల నుంచి శాంపిల్స్ తీస్తారు. ఇద్దరు అధికారులు చెరో 7 చొప్పున 14 శాంపిల్స్ తీసి విజయవాడలో ఉన్న డ్రగ్ కంట్రోల్ ల్యాబొరేటరీకి పంపించి నాణ్యత పరీక్షిస్తారు. నాణ్యత లేని మందుల కంపెనీలపై కేసులు నమోదు చేస్తారు.

## అథ్లెటిక్స్‌లో పతకాల పంట

- రాష్ట్ర స్థాయి పోటీల్లో 40 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు
- తెలంగాణలో జరగనున్న జాతీయ పోటీలకు 8 మంది ఎంపిక


జాతీయ పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 40 పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. 5 రోజుల పాటు జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు 12 బంగారు పతకాలతో పాటు 12 రజిత పతకాలు, 16 కాంస్య పతకాలు సాధించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది క్రీడాకారులు అక్టోబర్ మూడవ వారంలో తెలంగాణ రాష్ట్రంలోని హన్మకొండలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన వారిలో జి.లక్ష్మి, టి.లక్ష్మి, ఎం.హరీష్, ఎం.శారద, డి.ఉదయ్, బి.హరీష్, కె.సుశాంత్, బి.చాందినీ ఉన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించటంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను, జట్టుకు కోచ్ అండ్ మేనేజర్‌లుగా వ్యవహరించిన పి.సతీష్, ఎన్.శ్రీను, ఎ.లక్ష్మణ, పి.శేఖర్, లక్ష్మి, రెడ్డిలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

## సత్తాచాటిన సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకుడు


చెక్కు అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీలో అగ్రికల్చర్, బయో ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డా.ప్రత్యూష్‌కుమార్ దాస్ సెప్టెంబర్ 27వ తేదీన భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీల్లో సత్తాచాటాడు. వరి పంటలో 'పాలిమెర్ ఫంక్షనైజ్డ్ బయో బెడ్స్ మరియు సారవంతమైన మట్టి సంస్కరణలు (పీబీఈఏ)' పరిశోధనకు గానూ ఆయన బృందానికి తృతీయ బహుమతి లభించినట్లు డీన్ ఎం.దేవేందర్ రెడ్డి తెలియజేశారు. అమె ఒడిశా ముఖ్య కార్యదర్శి అసిత్ కుమార్ త్రిపాఠి చేతుల మీదుగా డాక్టర్ ప్రత్యూష్ కుమార్ దాస్ బృందం రూ.10 వేలు చెక్కు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుడికి సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు, ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం డీన్ ఎం.దేవేందర్‌రెడ్డి, డీన్ (అకాడమిక్) డాక్టర్ ఎస్పీ నందా, అసోసియేట్ డీన్ ప్రొ.అనిల్ కుమార్, డైరక్టర్ (అడ్మిషన్స్) డా.దుర్గాప్రసాద్ పాఢి, ఎం.సుబ్రహ్మణ్యం, డా.పి.కల్యాణ చక్రవర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లో భారీ పేలుడు

- పేలిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్
- పరుగులు తీసిన లైన్‌మన్


తెగిపడిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండే విద్యుత్ పరికరం

వీరఘట్టం/పాలకొండ: వీరఘట్టం–పాలకొండ మండలాల్లోని పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ నవగాం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి భారీ పేలుడు సంభవించడంతో షిఫ్ట్ లైన్‌మన్‌తో పాటు అక్కడ సిబ్బంది ప్రాణ భయంతో పరుగులు తీసారు. ఎం.వీ.పురం వద్ద ఉన్న ఉపరితల రక్షిత పథకానికి విద్యుత్ సరఫరా అందిస్తున్న ఫీడర్‌పై ఉన్న లింబ్(పింగాణీ పరికరం పెద్దది) పగిలిపోయి పింగాణీ ముక్కలు దూసుకురావడంతో అక్కడ ఉన్న సిబ్బంది పరుగులు తీసారు. లింగ్ బ్లాస్ట్ అయినపుడు బాంబు పేలినట్లు పెద్ద శబ్దం రావడంతో సమీపంలో ఉన్న వారంతా ఒక్కసారిగా ఏం జరిగిందోనని భయాందోళనకు గురయ్యారు. అనంతరం కొద్ది నిముషాల వ్యవధిలో కరెంట్ ఆయిల్‌తో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బ్లాస్ట్ కావడంతో పెద్ద మంటలు చెలరేగాయి. కరెంట్ ఆయిల్ చెల్లాచెదురుగా పడడంతో యార్డ్‌లో భయానకమైన పరిస్థితి నెలకొంది. అనంతరం పాలకొండ నుండి వచ్చే విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌కో సిబ్బంది పరిశీలించారు. సబ్ స్టేషన్ నుంచి వివిధ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఇచ్చే సమయంలో లింబ్‌తో పాటు పవర్ ట్రాన్స్‌పార్మర్ పేలడంతో భయంతో పరుగులు తీసారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు శరణ్య


రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన శరణ్య

వీరఘట్టం: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు బిటివాడ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని గార శరణ్య ఎంపికైనట్లు పీడీ వండాన రాజేంద్ర తెలిపారు. శనివారం జరిగిన ఈ పోటీల్లో అండర్–17 విభాగంలో ఎంపికై నట్లు తెలిపారు. నవంబర్ నెలలో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. హెచ్‌ఎం సి.హెచ్.రత్నాకరరావు, పాఠశాల సిబ్బంది శరణ్యను అభినందించారు.

## సంకల్ప సప్తాహను ప్రారంభించిన పీఎం

- అక్టోబర్ 3నుండి 9వరకు పలు కార్యక్రమాలు


వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సంకల్ప సప్తాహ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం వర్చువల్ విధానంలో ప్రారంభించగా.. కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు వీక్షించారు. సంకల్ప సప్తాహ కార్యక్రమంలో భాగంగా దేశంలో ఆశావహ జిల్లాల్లో ఎంపిక చేసిన బ్లాకుల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆ ప్రాంత వాసులను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడం జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలలో ఉద్యోగ సేవలు అందించడం గొప్ప వరంగా భావించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలలో మంచి పాలనాదక్షతవున్న అధికారులు, సిబ్బంది అవసరమన్నారు. ఆశావహ జిల్లాగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో భామిని మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా అక్టోబరు 3 నుండి 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లో మూడు బ్లాకులను ఎంపిక చేయగా భామిని మండలం ఎంపిక కావడం గమనార్హం. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిషాంత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ జి.మల్లిఖార్జున, ఇన్‌చార్జ్ డీపీఓ నాగభూషణరావు, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, డీఏఓ కె.రాబర్ట్ పాల్, సీఈఓ పి.వీరరాజు, మజ్జి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఐసీఏఆర్(పీజీ)లో ఆశా ప్రతిభ


ఐసీఏఆర్‌లో ర్యాంకు సాధించిన ఆశా

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన తొండవరపు ఆశాకు(ఐసీఏఆర్) ఇండియన్ కౌన్సిల్ ఆన్ అగ్రికల్చరల్ రీసెర్చ్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 15వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 6వ ర్యాంకు సాధించింది. ఆశా పదో తరగతి తాటిపూడి ఏపీఆర్‌జేసీలో చదివి 9.3 గ్రేడ్ సంపాదించింది. ఇంటర్‌లో 97 శాతం మార్కులు, బీఎస్సీ అగ్రికల్చరల్‌లో 84శాతం, ఎంఎస్సీ(అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్సన్ ఎడ్యుకేషన్ ) 92 శాతం మార్కులు సాధించింది. ఆశాకు ఐసీఏఆర్‌లో మంచి ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు టి.వెంకటరమణ, నాగరత్నంతో పాటు స్థానికులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

భామిని: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భామిని మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శనివారం తెలిపారు. కబడ్డీ, బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 9వ తరగతి విద్యార్థి వడ్డి దిలీప్, వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన కొత్తకోట దివ్యశ్రీ పాత్రో, సాయి గణేష్, నల్లకేవటి శాంతికుమారి, వాడాడ హారిక, ఎస్.జశ్వంత్, కె.జశ్వంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై వారిని ప్రిన్సిపాల్ శివకుమార్, కోచ్ కె.సోమేష్, పీడీ శివరామప్రసాద్ అభినందించారు.

## సారా రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..


పోలీసు అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

- జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఎస్‌ఈబీ డీసీ శ్రీరామచంద్రమూర్తి

పార్వతీపురం టౌన్: సారా రవాణా అమ్మకాలను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామని ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులతో జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ ఆధ్వర్యంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఎక్కువశాతం గిరిజన గ్రామాలు, కొన్ని ప్రాంతాల్లో ఒడిశా సరిహద్దు ప్రాంతాలు ఉండడం వల్ల ఒడిశా రాష్ట్రం నుంచి సారా రవాణా అవుతుందన్నారు. రవాణా నిర్మూలనకు పూర్తి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు చెక్ పోస్టుల వద్ద నిఘా పటిష్టపరిచామన్నారు. జిల్లాలో ఐదు ఎస్‌ఈబీ స్టేషన్లలో సిబ్బంది చాకచక్యంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతీ రోజు కేసులు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల తరుణంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. ముందస్తుగా పాత ముద్దాయిలను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్వతీపురం పట్టణంలో సారా నిల్వ కేంద్రాలను గుర్తించి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. సమావేశంలో సీఐలు ఉపేంద్ర, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, ఈశ్వరరావు, పీడీ ప్రసాద్, ఎస్‌ఐలు నాగభూషణ్, రాజశేఖర్, నాగభూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మరో ఇద్దరు టీచర్లు, హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు ఎంఈఓలకు, కస్పా స్కూల్ హెచ్‌ఎంకు చార్జ్ మెమోలు
- స్కూల్ కాంప్లెక్స్ విధుల మధ్యలో గైర్హాజరైన పది మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

విజయనగరం అర్బన్: విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పర్యటనలో తనిఖీ చేసిన ఆర్‌కే ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శనివారం ఆదేశాలిచ్చినట్లు డీఈఓ బి.లింగేశ్వరెడ్డి తెలిపారు. ఆ రోజు తనిఖీలో నాలుగవ తరగతి విద్యార్థుల మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల వర్క్ బుక్ పరిశీలనలో ఆయన గుర్తించిన అభ్యసన సామర్థ్యాలు లేని విద్యార్థులపై నిర్లక్ష్య వైఖరితో పాటు బోధనాపరమైన పలు అంశాలలో సంబంధిత టీచర్ల తీరుపై ప్రవీణ్ ప్రకాశ్ తీవ్రంగా అసంతృప్తి చెందిన విషయం తెలిసిందే. పాఠశాల నిర్వహణ లోపాలు కారణంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కూడా సస్పెండ్ చేసారు. అదే విధంగా ప్రవీణ్ ప్రకాశ్ పర్యటనలో తనిఖీ చేసిన స్కూల్ నిర్వహణ బాగోలేదని కస్పా స్కూల్ ప్రధానోపాధ్యాయునికి చార్జ్ మెమో ఇచ్చారు. రెండు స్కూళ్ల పర్యవేక్షణ లోపాల కారణంగా విజయనగరం మండల ఇద్దరు ఎంఈఓలకు కూడా చార్జ్ మెమోలు అందజేసారు. ఇదిలా ఉండగా జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ విధులపై నిర్లక్ష్యంగా గైర్హాజరైన 10 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు పంపారు. వీరిలో నలుగురు గైర్హాజరు కాగా, ఆరుగురు ఉపాధ్యాయులు మధ్యాహ్నం పూట మధ్యలో గైర్హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

## కోడి పందాలపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామ సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాలపై సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. పందెం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.16,300 నగదు, నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.